# తీర్పు

## క్రొవ్విడి లింగరాజు

**తొ**లితరం తెలుగు కథకులలో క్రొవ్విడి లింగరాజుది ప్రత్యేక స్థానం. గత శతాబ్ది మూడవ దశకంలో ఆయన వివిధ పత్రికలలో తరచు కనిపించే వారు. చాలా నిరాడంబరమైన శైలి. మనిషిలోని రకరకాల సంఘర్షణలు ఆయన ఇతివృత్తాలలో అధికంగా చోటు చేసుకునేవి. తీర్పు కథ ఫిబ్రవరి 1945లో ఆయన రాశారు.

---

"ఎవరండీ అధికారులు?"

"ఎందుకూ?"

"కేసు రిపోర్టు పుచ్చుకొనేవారు"

"ఏం కేసు?"

"కూనీ"

"ఏమిటీ! కూనీ కేసూ! ఊ..."

"అవునండి. నేనే కూనీ చేసింది!"

"ఎవరిని? .... పెళ్లాన్ని చంపావేమిటి?"

"కాదండి... కొడుకుని...."

సబ్ఇన్స్పెక్టరు ఉలిక్కిపడ్డాడు. పర్వతంలాటి మనిషొచ్చి తనంత తాను నేను నేరస్థుడనని చెబుతుంటే ఇన్స్పెక్టరు తెల్లపోవడమేమిటి? నేరం దొరికితే తియ్యనీటికి చేపెక్కినట్లు ఉత్సాహపడే పోలీసు ఉద్యోగికి మాంద్యం ఏమిటి? నిజంగా పారిపోతూన్న దొంగను తరుముకెళ్ళి గబాలున మీద పడి ఒడిసి పట్టుకున్నంత హంగామా చేయవలసిన పోలీసు ఆఫీసరు నెమ్మదిగా లేచి "అరెస్టు చేశాను. కూచో" అన్నాడు. తర్వాతి ప్రశ్న లాయన దగ్గిరి నుంచి రాకుండానే నేరస్థుడు "సందేహించకండి. నేను చంపేను. కారణం మీకు తెలియనక్కర లేదు. ఇదిగో రక్తం చవిచూచిన కత్తి. శవదహనమైపోయింది" అన్నాడు.

ఇన్స్పెక్టరు విధిలేక చట్ట ప్రకారం జరపవలసిన కర్మకాండ అంతా జరిపించడం మొదలెట్టాడు కాని అతని హృదయంలో ఏదో ఒక సంకోచం వెనక్కి లాగుతూనే వుంది. చేతులకు సంకెళ్ళు తగిలిస్తుంటే సంకెళ్ళు తన చేతికే బరువుగా కనిపించాయి. ముద్దాయి శరీరాన్ని శోధిస్తుంటే నవనవలాడుతూ వికసించిన గులాబీ పువ్వును అకారణంగా నలిపేస్తున్నట్లు వెక్కసపడ్డాడు. చీకటిగా ఉండే ఆ లాకప్‌లో అతన్ని నిర్బంధిస్తుంటే ధర్మదేవతను చీకటి కొట్లో వేస్తున్నట్టు కటకట పడ్డాడు. కాని డ్యూటీ... డ్యూటీ.... ఇండియన్ పీనల్‌కోడ్.... అది స్టీము రోలరు...

❀❀❀❀

కొంత స్థిమిత పడ్డాక ఇన్స్పెక్టరు నేరస్థుని ప్రశ్నించడం ప్రారంభించాడు. నేరాలు కూపీ తియ్యడంలో ఉండే నేర్పంతా చూపించాడు.

**ఆణిముత్యాలు**

చచ్చిపోయిన పెళ్లాం కొడుకేమో అనే అనుమానంతో ప్రశ్నలు కురిపించాడు. చేతికందిన వయస్సు అవడం వల్ల సరసంలో తండ్రి కొడుకులొక చోట తారసిల్లారేమోనని సంశయించాడు. ఎన్ని ప్రశ్నలకైనా నేరస్థుడు ఒక్కటే సమాధానం ఇచ్చాడు. "నేను నేరస్థుడిని. నా చేతుల్తో నా కన్న కడుపును కోసుకున్న పాపిని. ఈ ప్రపంచంలో జీవించడానికి నాకు చోటూ లేదు, అర్హతా లేదు. అందుచేత నన్ను శిక్షించండి. శిక్షంటే జైలు కాదు. ఉరికి పంపించండి" అన్నాడు.

అలా మాట్లాడే నేరస్థుడితో వ్యవహరించడం గజపతిరావు నాయుడుకు మరింత ఇరుకనిపించింది. లా అంటే మాటలా?

చంపినవాడు చంపలేదంటే ఊరుకుంటుందా? చంపనివాడు చంపేనంటే ఊరుకుంటుందా? పెళ్లికి చావుకీ ఉన్నంత కర్మకాండ జరగాలిసిఉంటె. నూరుమంది కళ్ళ ఎదుట మనిషిని మనిషి చంపితేనే సవాలక్ష గ్రంథం జరగాలిసిన లా, ఒక మనిషొచ్చి నేను హత్య చేశానంటే మాత్రం ఒప్పుతుందా? కాకపోతే ఇలాంటి కేసును ఎన్నడూ చూచి ఎరుగని నాయుడుకు మాత్రం ఆశ్చర్య కారణమైంది. నాయుడికే అంతంతగావుంటే జవానుల కేమి తెలుసు? వాళ్ల సంతోషమల్లా ఒక్కటే. ఉచ్చులో పడింది పెద్ద పక్షి. అంతే. ఎంతో పనిచెయ్యకపోతే ఇల్లా వచ్చి ఇందులో చిక్కుకుంటాడా అనే నమ్మకం.

❀❀❀❀

ముద్దాయి రామన్న గ్రామం విజయేశ్వరం. గోపూరు పోలీసు స్టేషనుకు ఎనిమిది మైళ్ల దూరంలో వుంది. గ్రామమైతే పెద్దదీ, మోతుబరీ రైతాంగం కలది. అయినా ఆ ఊరు ప్రయాణానికి సౌకర్యం లేదు. వేసవి కాలంలో తప్ప బళ్ళబాట లేదు. మిగతా రోజుల్లో కోటీశ్వరుడికైనా కాలినడకే శరణ్యం. అందుచేత ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నా ఉద్యోగస్థుల తాకిడి తక్కువవడం చేత ఇదే నయమనుకుని రోడ్డు కోసం ఆందోళన చెయ్యడం లేదని ప్రతీతి. కొద్ది రోజుల క్రిందటనే గోపూరు స్టేషనుకొచ్చిన నాయుడు తెల్లారగట్లే లేచి నానా క్షోభపడి విజయేశ్వరం చేరుకున్నాడు. ఉద్యోగస్థుల తాకిడి అంతగా ఎరుగని జనం పోలీసు ఉద్యోగి వచ్చేసరికి గడబిడ పడ్డారు. గజపతిరావు నాయుడు గ్రామ చావడిలో మకాం వేసి జవానుతో కబురంపి మునసబును రప్పించాడు. మునసబు రావడంతోనే-

"ఏదయ్యా నీ బకీరు?" అన్నాడు నాయుడు.

"అదేటండోయ్! బకీరా?"

"అవును. ఏమెరగనట్లు మాట్లాడతావేం?"

"ఏటండోయి ఇన్‌స్పెక్టరుగారూ! ఇపరీతంగా సెప్తున్నారే?"

"ఏమయ్యా మునసబూ! అట్టే నటించకు. ఊళ్లో పలుకుబడి ఉన్నంత మాత్రాన కేసు కుమ్మకు చేద్దామంటే సాగదు సుమా. అందులోనూ కూనీ కేసు!"

"కూనీ కేసాండి! మా ఊళ్ళోనా? అదేటండి!"

"ఓహో! నంగనాచిలా మాటాడుతున్నావు. ఇంతకూ అతని పలుకుబడి అంత గొప్పదేం? అబ్బాయి! మునసబూ, ఈ పోకడలు కట్టిపెట్టు. నిన్న ప్రొద్దున్న మీ ఊళ్లో కూనీ జరిగింది. ఈ ఊరికల్లా నాయకుడట కాదూ ఆ రామన్న. అంత మాత్రాన్ని దాగుతుందనుకోకు. ఆ రామన్న కొడుకుని కూనీ చేశాడు. మరి..."

"అదేంటండోయ్ -- రామన్న దొరా! కూనీ! కొడుకుని..." అని తెల్లబోయాడు మునసబు.

మొదట నందేహావడుతూ వచ్చిన ఇన్‌స్పెక్టరుకు ఇందులో ఏదో కుంభకోణ ముందనే అనుమానం ప్రబలింది.

"ఏమయ్యోయ్ మునసబూ! ఇందులో దాచడానికేమీ లేదు. నిన్న ఉదయం రామన్న తన కొడుకును తాను కూనీచేసినట్లు ఒప్పుకుని రాత్రి వచ్చి రిపోర్టు ఇచ్చి అరెస్టు అయినాడు. ఆ కేసు విచారణ జరపడాని కొచ్చాను. బకీరు రాయకపోతే నీ కొంపమీది కొస్తుంది..."

అని ఇంకా చెప్పబోతుంటే మునసబు మాట కడ్డొచ్చాడు. "ఏమండోయి ఇన్‌స్పెక్టరు గారూ! నిజం చెప్తా వినండి. రామన్నదొర అలాంటి మనిషికాడు. బహు పెద్దమనిషి. మా బురదనాటి సీమంతా ఆయన్ని ధర్మదేవతలా చూచుకుంటాం. నిన్న ఆయన కొడుకు చచ్చిపోయిన మాట వాస్తవమే. మేమంతా వెళ్ళి దహనం చేసొచ్చాం. కాని అది కూనీ ఏమిటండీ? ఆకతాయి ముండాకొడుకు ఆ కొడుకు. నానా రోగాలూ పడి ఒళ్ళు పాడు చేసుకుని చచ్చాడు. వాడిని ధర్మదేవత చంపడ మేమిటండీ? ఇందులో ఏదో ఉందిబాబు! నిన్ననే నేను జనన మరణాల పుస్తకంలో రాశాను. అంతేకానీ కూనీ లేదండి బాబూ! నమ్మండి!"

ఇన్‌స్పెక్టరు అడ్డొచ్చి "మునసబూ! అదేమీ ప్రయోజనం లేదోయి. నేరస్థుడే వచ్చి నేరాన్ని ఒప్పుకుంటే నువ్వూ నేనూ గిజగిజలాడితే మాత్రం ఏమి ప్రయోజనం? రామన్న గోపూర్ లాకప్‌లో ఉన్నాడు. తెలుసా?"

"ఇన్‌స్పెక్టరు గారూ! నమ్మడానికి

మనసొప్పడం లేదండి. మా దొర ఖైదీ అవడమేటండీ! అలాంటి చిల్లర మనిషి కాదండి!"

"అదేమిటోయి! నీకెంత చెప్పినా అర్థం కాదేమిటి? చూడగా చూడగా నీ పీకమీదికి తెచ్చుకొనేటట్టున్నావు. మాట్లాడక నే చెప్పినట్లు బకీరు వ్రాయి. పద వాళ్ళ ఇంటికి. విచారణ చేద్దాం".

"ఏం విచారణ బాబూ! ఆ ఇల్లాలి మొహం ఎల్లా చూడడం? ఇంతకీ ఎంత నిర్భాగ్యుడైనా ఒక్కడే కదా కొడుకు. కడుపు దుఃఖం చేత మనిషికేమైనా మతి భ్రమ కలిగిందేమో యోచించారు?"

"అలాంటి చిహ్నాలేమీ లేవు. కొంచెం ఆవేశం కనిపించింది. అంతే".

❀❀❀❀

నాయుడు, మునసబు, నలుగురైదుగురు పెద్ద మనుష్యులు రామన్న ఇంటి కెళ్లేరు. పుత్రశోకంతో మూలబడ్డ అతని భార్య లచ్చుమ్మ (అనే లక్ష్మీదేవమ్మ పోలీసు రికార్డులో)కు రామన్న కబురు చెప్పేరు. ఒక్క వేటుతో కూలిపోయిన అరటిచెట్టులా పడిపోయి ఘొల్లుమంది. కొడుకు చావుకు భర్తపాటు తోడై జీవితమంతా అంధకారమై పోయింది. ఈ రెండు బాధలకన్న తెరబయట నున్న పోలీసు ఇన్‌స్పెక్టరు ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ మరింత ఎక్కువైంది. అప్పటికప్పుడే నాయుడు ఇంక్వయిరీలో రామన్న చాలామంచి వాడనీ, పెద్దమనిషి అని, ధర్మాత్ముడనీ, చుట్టుప్రక్కల నాలుగైదు గ్రామాల వాళ్ళు అతని ధర్మ నిర్ణయానికి బద్ధులై వుంటారనీ తెలిసింది. అందుచేతనే గజపతి రావు నాయుడుకు నేరం సంగతి మరింత అగమ్యమైపోయింది. అలాంటి ఘరానా మనిషి తనూ, భార్యా అనేక మ్రొక్కులు మ్రొక్కి నలభైయవ ఏట కన్న కొడుకును – ఎంతో అపురూపంగా పెంచుకున్న కొడుకును – వాడు ఎంత దుర్మార్గుడైతే మాత్రం చేతులారా చంపడానికేమి కారణం ఉంది? అందుచేతనే లచ్చుమ్మను విచారించడంలో సామాన్యంగా పోలీసు ఉద్యోగస్థునిలో అపురూపమైన శాంతాన్నీ, సౌమ్యతనూ తెచ్చుకొని మాట్లాడేడు.

"గోరు చుట్టు మీద రోకటిపోటా దేవుడా!" అంది.

"తెలిసినదంతా చెపితే ఉపకారం జరుగుతుందమ్మా!"

"నా జన్మకికఒకటే ఉపకారం... ఇంతకీ ఆ మహరాజు చంపడమేమిటి కొడుకుని? వాడి కర్మానికి వాడే పోయాడు..."

"ఆయనేవచ్చి తన కొడుకుని తానే చంపినట్లు చెపుతున్నాడే మరి!"

"అదేమిటో నాయనా! నాకేమీ తెలియదు. ఆయనల్లా ఎందుకు చెప్పేడో! చెట్టంత కొడుకు రాలిపోతే మతి చలించడంలో ఆశ్చర్యమేమిటి? మొండి ఘటాన్ని గనుక నేను బ్రతికున్నాను. ఆయన కర్మంతా చాలక కోర్టుకు కూడా ఎక్కాలి కాబోలు..."

## సుర్తు

అది చిహ్నమే అఖిల విశ్వానికి!
అనవరత పరిణామ క్రమంలో
అతి విలయానికి అది కారణమంటారే కానీ
అది ప్రభావానికీ మూలమని తెలుసుకోరు
లయం అంచులోనే సృష్టి ఉంటుందనీ
సృష్టి సైతం ఎప్పటికైనా లయాన్నే కంటుందనీ
తెలుసుకోకుంటే ఎంత కష్టం?
స్థితిమాత్రం సుస్థిరమని ఎవరు చెప్పగలరు?
గతి తప్పిన స్మృతి పథంలో
అతుకుల గతుకుల్ని ఎవరు విప్పగలరు?
చిహ్నం ఒక్కటే శాశ్వతం!
చిదానందామృతవాహినిలో
చిన్న బిందువైనా సింధువే!
బిందువులో సింధువును దర్శించడం
చిహ్నంలో చిరంతన జ్యోతిని స్పర్శించడం
చిహ్నమే సత్యం
చిహ్నమే నిత్యం
చిహ్నాన్ని ఆరాధిస్తూ
చిరంజీవి కావడం అగత్యం!
చేతనావిష్కారమే ఎల్లప్పుడూ స్తుత్యం!!

–డా. అయాచితం నటేశ్వర శర్మ

"తండ్రికొడుకుల కేమైనా తగాదాలున్నాయా ఏమిటి?"

"అయ్యో, రామా! అది కూడానా? నూరునోములు నోస్తే లేకలేక కలిగిన నలుసును అపురూపంగా పెంచుకున్నాం. మా ప్రారబ్ధం కొద్దీ వాడి నడవడి మంచిదైంది కాదు. అయినా తండ్రీ కొడుకులు మాట్లాడుకుంటేగా దెబ్బలాట రావడానికి?"

"ఆవేళ ఏమైనా తగాదా పడ్డారా?"

"అదేమో నాకు తెలియదు. క్రితం రాత్రి ఏడు గంటలకు వీధి వెంకయ్య గారు, ఇంకా ఎవ్వరో వచ్చి కొడుకు మీద ఆ మహరాజుతో ఏదో నేరం చెప్పేరు. వాళ్ల అమ్మాయిని వాడు మోటుసరసం చెయ్యబోయాడని కాబోలు! మా వాడు అనేక రోజులుగా దుస్సహవాసం పట్టి అన్నివిధాలా పాడైపోయాడు. నాయనా! వారితో ఎన్నోసారులు మూర్ఖపురాలిని నే చెపుతూ వస్తే వినిపించుకోలేదు. ఇంటి వ్యవహారాలు చూడడానికి వారికి తీరిక ఎక్కడ? ఎప్పుడూ ఏదో ఊరి వ్యవహారమే అయిరి... పెద్ద మనుష్యులు వెళ్ళిపోయిన తర్వాత మాత్రం మామూలుగా భోజనానికి లేవకుండా బెంగపడి కూచున్నారు. ఎన్నిసారులు పిలిచినా లేవలేదు. దానికితోడు తెలివి తక్కువ దాన్ని నేను గూడా ఆయన్ని ఒక మాటన్నాను. "కొమ్మైనప్పుడు వంగకపోతే మానైతే వంగుతుందా? చిన్ననాడు వాడిని అదుపాజ్ఞలో పెట్టకపోయి ఇప్పుడు దిగులుపడితే ఏం ప్రయోజనం? లేవండి" అన్నాను. ఆ మారాజుకేం కష్టం కలిగిందో మరి. ఎప్పుడూ లేదు. భోజనం చేసి కొడుక్కోసం చావట్లో అల్లాగే కునుకుతూ కూచున్నారు. కొడుకు రాత్రి తొమ్మిది పది గంటలకు తూలుతూ వచ్చి తిన్నగా తనగదిలో కెడుతుంటే తండ్రి చెయ్యి పట్టుకున్నారు. వాడు విదిలించుకుని లోపలికి పోయాడు. లోపల నుంచే భోజనం అక్కరలేదని ఒక్కకేక పెట్టేడు నాకు. తండ్రి కూడా గదిలో కెళ్ళేరు. నేను కూడా వెళ్ళబోతే తండ్రి రావద్దన్నారు. కడుపు తీపి ఏడిపించినా ఆడదాన్ని నా కెందుకన్నట్లు వెనక్కొచ్చాను. తండ్రి వాడిని మందలించారు. లాలించారు. కొడుకు కూడా కొంచెం మర్యాద హీనంగా మాట్లాడినట్లు అక్కడక్కడ వినిపించిన ముక్కల వల్ల నాకు తెలిసింది. అప్పటికి రెండు రోజుల క్రిందటనే రామన్నపేట నుంచి వాడికి ఇరవై ఎకరాలు కట్నమిచ్చి పిల్లనిస్తామని వచ్చారు. మారాజు ఏమీ మాట చెప్పలేదు. 'పెళ్లి అయితే కుదుట పడతాడు. చెయ్యగూడదా?' అని నేనొక ఆడమాట అన్నాను. 'దాని గొంతుక కూడా కొయ్యాలా?' అన్నారు. మళ్ళీ ఆ రాత్రి వాడితో పెళ్ళి సంగతేదో చెప్పినట్లున్నారు. 'నాకొద్దు. పెళ్లీ వద్దు. పెటాకులూ వద్దు' అనే మాటొక్కటే నాకు వినిపించింది. నేనెరిగింది అంతే. అర్ధరాత్రి ఆయనగారు లేచి కొడుకు గదిలోకెళ్లి, కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ వచ్చి నన్ను లేపి 'అంతా అయిపోయింది. అబ్బాయి చచ్చిపోయాడు' అన్నారు. నేను గొల్లుమంటూ లేచి గదిలోకి వెళ్లేసరికి మొగం నల్లబడిపోయి పడున్నాడు కొడుకు. తర్వాత చెప్పడానికేముంది? నలుగురూ వచ్చారు. ఏడుపులు, పెడబొబ్బలు! నాయనా, కలికాలం, తండ్రి ఆపత్తు గడపవలసిన కొడుకుకి తండ్రే చేతుల్తో కొరివెట్ట వలసి వచ్చింది. లేకలేక కలిగిన మా సంతానం మూడునాళ్ళ ముచ్చటై పోయింది".

అని ఒక్కసారిగా లచ్చమ్మ బావురుమంది. ఇన్‌స్పెక్టరు హృదయం కూడా కరిగి పోయింది. అతనికి దిక్కుతోచలేదు.

❀❀❀❀

గజపతిరావు నాయుడు కథంతా మననం చేసుకున్నాడు. ఊళ్ళో దర్యాప్తు వల్ల తెలుసుకున్న దానికి లచ్చమ్మ కథా కలుస్తోంది. కాని రామన్న స్టేటుమెంటుకు ఏమీ అందడం లేదు. ఆత్మహత్యా అనే సంశయం కలగక పోలేదు గాని రామన్న ఆ భారాన్ని తనమీద ఎందుకు వేసుకుంటాడు? కడుపు తీపే కాని ప్రాణం తీపి మాత్రం తక్కువదా? కాని శాంతుడైన వాడు రేగితే ధర్మరాజు కోపం లాంటిదే కదా. అందులోనూ పరువు ప్రతిష్ఠలతో బ్రతికే వాడికి కడుపు తీపి కన్న కూడా ఆత్మగౌరవం ఎక్కువై, కొడుకుచేసిన ఏ దుర్మార్గానికో కుపితుడై తాత్కాలికోద్రేకం చేత ఏ కొట్టరాని చోటనో కొట్టి ఉంటే చచ్చిపోవచ్చును అని కథ

కలుపుకున్నాడు. ఇందులో వెనక ముందాలోచనలకీ, దయా దాక్షిణ్యాలకీ పరిపూర్ణమైన ఆస్కారమున్న 'లా' దృష్టిలో వీటికి చోటు లేదు. మతాచారాల్లో అభానికీ, శుభానికీ కూడా ఎంతో తతంగం విధిగా నడపవలసినట్లే 'లా' కూడా దాని పంథానది అవిచ్ఛిన్నంగా నడవ వలసిందే. అప్రయత్నంగా రామన్న నిర్దోషియనీ, అతణ్ణి తప్పించాలనీ నాయుడుకేదో అభిప్రాయం స్ఫురించేది కాని పోలీసు ఉద్యోగం. డ్యూటీ, లా, పీనల్‌కోడ్ ఇవన్నీ జ్ఞాపకం వచ్చే సరికి మామూలు ఉద్యోగస్థుడయ్యే వాడు. రామన్న వ్యవహారం చూస్తే ఎంతో ప్రయత్నించినా కొరుకుడు పడేటట్టు లేదు. లాకప్‌లో ఏదో దీర్ఘాలోచనాతత్పరుడై ఉండడం, ఎన్ని ప్రశ్నలకైనా ఒక్కటే జవాబు చెప్పడం జరుగుతోంది.

"ఎందుకండీ ఈ తర్జన భర్జన? నా కడుపును కోసుకున్న కరినుడ్ని.... ఎవరి కోసం నే బ్రతకాలి? లా ప్రకారం శిక్షించి నా బాధ తప్పించండి. మీకెల్లా కావలిస్తే అలా బందోబస్తు చేసుకోండి" అనేవాడు. పైగా ఊరివాళ్లు, బంధువులు ఎందరో చూడడాని కొస్తే ఎవ్వళ్లనీ తన దగ్గరికి తీసుకురావద్దన్నాడు. ఈ మనిషితో ఏం చెయ్యడం? కేసు తంతు నడువ వలసిందే! దొరికినంత కథను గుదిగ్రుచ్చి, పై ఉద్యోగస్థులతో సంప్రదించి కూనీ కేసు బనాయించాడు నాయుడు.

❀❀❀❀

కూనీకేసు తతంగం అంతా నడిచింది. మొదట మేజిస్ట్రేటు ఎదుట ఆయన స్టేటుమెంటు రికార్డు చేయడం, మేజిస్ట్రేటు కోర్టులో కొంతతంతు నడపడం, మేజిస్ట్రేటు సెషన్సుకు పంపడం జరిగింది. కేసులో ఎన్నిలోపాలుంటే మాత్రం ఏమిటి? ముద్దాయి నేరాన్ని ఒప్పుకుంటున్నప్పుడు కేసులో కష్టమేముంది? రామన్నను సెంట్రు జైలు లోకి తీసుక పోయారు.

❀❀❀❀

సెషన్సు జడ్జి గిరిరావు పంతులుకు పింఛను పుచ్చుకొనే కాలమయ్యే సరికి జిల్లా జడ్జీ పనైంది. జిల్లా మునసబ్బు ఉద్యోగంలో ప్రవేశించి క్రమంగా ఈ ఉద్యోగాని కొచ్చాడు. మనిషి చాలా శాంత స్వభావుడూ, పాపభీతి కలవాడూ అవడం చేత ఉద్యోగంలో ప్రమోషను కూడా నిదానంగానే వచ్చిందని ప్రతీతి. ముద్దాయిని శిక్షిస్తుంటే ఆ శిక్ష తాననుభవిస్తున్నట్లు తహతహలాడేవాడు. అట్టే కాలం ఉండదు కనుక హైకోర్టు ఊరుకుంది కాని, లేకపోతే ఎన్ని దెబ్బలు తినవలసినవాడో. ఆయన ఎదుట రామన్న విచారణ. పబ్లిక్ ప్రాసిక్యూటరు రావుసాహెబు వెంకయ్యా నాయుడు అధికారుల

## ఈ గీతానికి పేరేమిటి?

ఇందాకట్నించి చూస్తున్నాను
రాజమండ్రి వరదల్లా పొంగివస్తున్న
ఆ పిల్లవాడి ఏడుపుకి
ఏ ఆనకట్టలు కడదాం
ఇటుక తట్టలు మోస్తున్న వాళ్ళమ్మ
అంతెత్తు నిచ్చెనపై నుంచి
ఎప్పుడు దిగి వస్తుందో
ఎప్పుడు పాలిచ్చి వూరుకోబెడుతుందో
ఇందాకట్నించి చూస్తున్నాను
కడుపులో పేగుల్ని మెలిపెట్టినట్టు
నే పడుతున్న బాధకు
ఏ టైటిల్ పెట్టడానికవుతుంది
పొద్దస్తమానం ఆమె మోస్తున్న
అంత బరువైన ఇటుక తట్టలకు
వణికిపోతున్న ఆమె కాళ్ళ కింది నిచ్చెన
ఎప్పుడు కూలుతుందో
పిల్లవాడికి పాలివ్వడానికి
దొర అనుమతి ఎప్పుడు దొరుకుతుందో
హీనస్వరంలో పిల్లవాడి ఏడుపు
పైనున్న తల్లి గుండెల్లో
సుడులు రేపుతూనే వుంది
కిందికి దిగివచ్చే సమయం కోసం
క్షణాల ముళ్ళపై ఆమె కాళ్ళు
పైకి కిందికి తడబడుతూ వున్నై
ఇందాకట్నించి చూస్తున్నాను
నే పడుతున్న బాధకు
ఏ టైటిల్ పెడదామన్నా సరిపోదు

–భూషి కృష్ణదాసు

దయ వల్ల తొమ్మిది సంవత్సరాలుగా ఆ పని చేస్తున్నాడు. మళ్ళీ మూడు సంవత్సరాలు ఉద్యోగం పొడిగించుకోడానికి ఆత్రత పడుతున్నాడు. కేవలం అలవాటు వల్ల పోలీసు కేసులో తిరుగుడుండదనీ, చిన్నచిన్న లోపాలున్నా వాటిని సర్దుకోవలసిన వూచీ ప్రాసిక్యూటరుదనే నమ్మకంతో వాదించేవాడు. పోలీసు కేసులో ముద్దాయికి శిక్ష పడినప్పుడల్లా తన దివాన్ బహదూర్ ఆదర్శానికి ఒక మెట్టు సాధించినట్టుగా నమ్మే వాడు. లా యొక్క నిరంకుశత్వంలో అలాంటి విశ్వాసాన్ని ఆయన కుదుర్చు కున్నాడు. ఇనస్పెక్టరు గజపతిరావు నాయుడు సామాన్యంగా కూనీ కేసుల్లో పోలీసు అధికారులు చూపించే ఉత్సాహాన్ని చూపకుండా ఏదో పోలీసు యంత్రంలో ఒక్క కీలుగా మాత్రమే పని చేస్తుండడం రావుసాహెబుకు అత్యంత ఆశ్చర్యం కలిగించింది.

ప్రాసిక్యూటరు సాక్ష్యమై పోయింది. ముఖ్యసాక్షి గజపతిరావు నాయుడే. రామన్న అంగీకారానికి అనుగుణ్యంగానే ఉంది అతని సాక్ష్యం. ముద్దాయి వకీలును ఏర్పాటు చేసుకోవడానికి నిరాకరించాడు. అతడు తప్పించుకో దలచుకుంటేగా! జడ్జి పట్టుదల మీద గవర్నమెంటు ఖర్చుతో ముద్దాయి తరపున వకీలు ఏర్పాటైనాడు. అతడు మాత్రం ఏం చేస్తాడు? ప్రాసిక్యూషన్‌లో లోపాలు చూపించగలడు కాని రామన్నకు పాఠం చెప్పగలడా? సాక్షి విచారణ ముగిసిన తర్వాత జడ్జి ముద్దాయిని–

"ఏం చెప్తావు? నేరం చేశావా?"

"నేరస్థుడనే"

"మేజిస్ట్రేటు ఎదుట ఇచ్చిన స్టేటుమెంటు ఐచ్ఛికంగానే ఇచ్చావా?"

"ఆ"

"అందులో సంగతలన్నీ నిజమేనా?"

"మార్చడానికేమీ లేదు"

"హత్యకి కారణం ఏమిటి?"

"అయిపోయిన తర్వాత ఆ విచారణ ఎందుకండీ?"

రామన్న ముఖంలో దీనత్వముందికాని, అధైర్యం ఎక్కడా కనబడడం లేదు. మానవ ప్రకృతిని గురించిన తత్వవిమర్శను ఎంతో అప్పుడప్పుడు గిరిరావు పంతులు చదువుతూ వచ్చాడు. కాని ఈ ముద్దాయి వైఖరి తనకు అవగాహన కాలేదు. అయితే ఇతడు అపూర్వమైన ధర్మమూర్తి కావాలి; లేకపోతే తడిగుడ్డలతో గొంతుకోసి పచ్చి నెత్తురును త్రాగే కటిక వాడైనా కావాలి. సాక్ష్యంలోని విషయాలు, ముఖంలోని దీనత్వం, ధైర్యలక్షణాలు సమన్వయిస్తే రెండవ తరహాగా ఆలోచించడానికి ఆస్కారం కనిపించలేదు జడ్జీగారికి.

ప్రాసిక్యూటరు నేరారోపణ చేస్తూ వాదించాడు. ముద్దాయి అంగీకారం, హఠాత్తుగా చచ్చిపోయిన వాడి శవాన్ని పరీక్షకు పంపకుండా తన పలుకుబడి నుప యోగించి దహనం చేసెయ్యడం, ముద్దాయి భార్య లచ్చమ్మ స్టేటుమెంటులోని తండ్రి కొడుకుల తగాదా, అన్నీ ముద్దాయి దోషానికి నిర్ధారణలుగా చూపించాడు. హత్యకు కారణం ఏదో ప్రబలమైనది ఉండితీరుతుందనీ, ఏ స్త్రీయైనా కూడా కారణం కావచ్చుననీ, రామన్న పలుకుబడి వల్ల అలాంటి సాక్ష్యం రావడం అసంభవమనీ వాదించాడు. ఆయన వాదిస్తుంటే రామన్న ముఖం చిట్లించుకొని కటకట పడ్డాడు. ఒళ్లంతా చీమలు, జెర్రెలు పాకినట్లు చిరాకుపడ్డాడు. శరీరాన్ని సూదుల్తో గుచ్చినట్లు బాధపడ్డాడు. ఆ తహతహ రావుసాహెబు కేం తెలుస్తుంది? ఎద్దు పుండు కాకికి నొప్పా? రాలిపోయినది ముసలి పండైనా, బద్దలైనది పచ్చినామైనా అపరకర్మ చేయించే పౌరోహితుడికి మంత్ర తంత్రాలు ఒక్కటే. తంత్ర ప్రకారం గోదాన భూదాన సాలగ్రామ దానాలు అడుగుతూనే ఉంటాడు. లా తంత్రం గూడా అలాంటిదే. అది యథావిధిగా సాంగో పాంగంగా నడవవలసిందే. ముద్దాయి పలుకుబడి వల్ల కలిగిన లోపాల నాస్కారం చేసుకొని అతన్ని విడుదల చేస్తే పరగణాలో నేరం హద్దులు మీరిపోతుందని కూడా వాదించాడు రావుసాహెబు.

గవర్నమెంటు ఏర్పాటుచేసిన ముద్దాయి వకీలు యథావిధిగా తన ధర్మాన్ని నిర్వర్తించాడు.

ముద్దాయి నేరాన్ని అంగీకరించినంత మాత్రాన శిక్షార్హుడు కాడనీ, పుత్రశోకం వల్ల మతిభ్రమించి తత్కాలమైన ఆవేశం వల్ల చచ్చిపోయే ఉద్దేశ్యంతో అలా అంగీకరించి ఉండవచ్చుననీ వాదించాడు. ఇంతకూ ఇలాంటి నేరానికి కారణం ప్రధానమైనదని హైకోర్టు తీర్పులన్నీ చూపించి, అలాంటి ప్రబల కారణం ఏమీ ప్రాసిక్యూషన్ రుజువు చేయలేదు కనుక అందుచేత సంశయానికి తావుందనీ, బ్రిటీష్ చట్ట ప్రకారం సంశయముంటే ముద్దాయి కనుకూలంగా తీర్పు ఇవ్వాలనీ చక్కగా వాదించాడు. రామన్న మహనీయమైన ఒక ఆవేశంలోనో ఒక ధర్మ వివేచనలోనోపడి ఈ నేరాన్ని తన నెత్తిపై వేసుకుంటున్నాడనీ, ఈలాంటి బాధ్యత వహించడం అగాధమైనట్టిన్నీ, భవిష్యత్తులో మాత్రమే గోచరమయ్యేటట్టిన్నీ ఒక్క మహత్తరమైన నైతిక కారణం ఉంటుందనీ, మామూలు కేసులా దీనిని విచారించ కూడదనీ, ఈ బాధ్యత న్యాయమూర్తిదే అనీ వాదన ముగించాడు.

ఈ యువకుడి కెందుకు తన జీవితం యెడల ఇంత పట్టుదల కలిగిందా అని తెల్లబోయి చూస్తున్నాడు రామప్ప. బాధ్యత తనమీద పెట్టిన ఆఖరు వాక్యం విని జడ్జీ నూతన భారంతో క్రుంగినట్లయినాడు. పబ్లిక్ ప్రాసిక్యూటరు ముద్దాయి వకీలు వాదనను హేళన చేస్తూ జవాబు చెప్పేడు. తీర్పుకు కేసు వాయిదా వేశారు.

❀❀❀❀

విచారణ జరుగుతున్నంత సేపూ జడ్జీ దృష్టి ముద్దాయి ముఖం మీదనే ఉంది. పిసరంతైనా మృత్యుభీతి ఆ ముఖం మీద కనబడడం లేదు. నిండుకుండలా తొణుకూ బెణుకూ లేకుండా ఉన్నాడు. ఆ కుండలో నిండి ఉన్నది నిజమైన శాంతో, లేక దుఃఖమో పరమేశ్వరుడి కెరుక. విచారణ ముగిసినప్పటి నుంచి ఆయనకు ఆందోళన హెచ్చింది. ఇక ఆ మనిషి ప్రాణం తన చేతిలో వుంది. ప్రాసిక్యూషన్ వాదంలో లోపాలున్నా ముద్దాయి అంగీకారం బలంగా వుంది. ఢిపెన్సు వకీలు చెప్పిన మహత్తరమైన నైతిక కారణం ఉండడానికీ సావకాశాలున్నాయి. కేవలం ముద్దాయి మాట నమ్మి శిక్షిస్తే ఒక ప్రాణం తన చేతి మీదుగా పోతుంది. జైలుతో అతని ప్రవర్తన ఎలా ఉందో తెలుసుకోవడానికి జైలు అధికారుల నడిగేడు. రామన్న ఎప్పుడూ ఏదో ధ్యానంలో ఉంటాడనీ, మామూలు కూనీ ఖైదీలలాగా తన కేసు సంగతి అందరితో చెప్పుకోడనీ, ఎవరికీ ఏ విధమైన శ్రమ ఇవ్వడనీ జైలు అధికారులు చెప్పేరు. ఈలాంటి అగాధమైన మనిషియొక్క ఆంతర్యం తనకు ఎలా తెలుస్తుంది? కేవలం నిర్జీవమైన పుస్తకపు లా ఆధారం చేసుకుని శిక్ష విధించాలనొస్తే తన చేతి మీదుగా ప్రాణం తీయాలనొస్తుందే. ఈ విచక్షణ చెయ్యకపోతే తానుచేసే న్యాయ మేమిటి? ఈ విషయంలో తనకెవరు సాహాయ్యం చేస్తారు? ఇలా పరిపరివిధాలుగా జడ్జీ ఆందోళన పడ్డాడు.

జడ్జిమెంటు రోజు వచ్చింది. ముద్దాయిని తన ప్రైవేటు గదిలోనికి రప్పించారు. ఒంటరిగా ముద్దాయి ఎదుట నిలబడ్డాడు. జడ్జీ కూచోమని కుర్చీ చూపించాడు. రామన్న చేతులు జోడించి కూచోడానికి నిరాకరించాడు. ఆ మర్యాదకు రామన్న ముగ్ధుడైనాడు.

జడ్జీ - రామన్నా. చాలా కేసులు విచారించాను. చాలామంది నేరస్థుల్ని చూచాను. కానీ నీలాంటి నేరస్థుడిని గానీ, ఇలాంటి నేరాన్ని గానీ చూడలేదు.

ముద్దాయి - చిత్తం.

## ఎచటికో ఆ పయనం

ఆకాశంలో మేఘాల సభ
జరుగుతున్నట్లున్నది
సిద్ధం సిద్ధం అను ముక్తకంఠం
వినిపిస్తున్నది.
అవి ఎక్కడ కురిసినా ఉపయోగమే
మా భూమిని దాటుకుంటూ
పోతున్నాయని ఒకింత
అసూయ కలిగినా
నా విశాల దృక్పథం పోనియ్ అంటున్నది.
మట్టి తడిస్తే చాలంటున్నది.

-జి. శ్రీశైలం

"నువ్వు నిజంగా ఈ నేరం చేశావా?"

"నేరస్థుడి నేనండీ?"

"అది కాదోయ్! నువ్వు నీ చేతుల్తో నీ కొడుకును చంపేవా అంటాను"

"అపరాధం నాదే ప్రభూ"

"మాటకు మాట సూటిగా చెప్పవోయ్!"

"చెప్పడానికేముందయ్యా! నేనే నేరస్థుడిని"

ఆ మాటల్లో ఏదో మడత గోచరిస్తూనే వుంది జడ్జీకి. చివరికి కొంచెం నిస్పృహతో–

"ఏమోయి రామన్నా! ఈ ప్రశ్నలన్నీ నేను నా ఉద్యోగం హోదాతో వెయ్యడం లేదు. అలా వేస్తే కోర్టులోనే అడుగుదును. నీ ప్రవర్తనలో నాకేదో చిత్రం కనిపించే ఒక పెద్దమనిషి అడిగినట్లడుగు తున్నాను. అంతేకాదు. నీ విషయమై సత్యం తెలుసుకోక పోతే అపరాధిని నేనవుతాను".

జడ్జీ మాటల్లో సౌజన్యత, అభ్యర్థిత్వం రామన్నను కరిగించినాయి. బందోబస్తుగా కట్టివేయబడిన దుఃఖానికి కట్టలు తెగిపోయినాయి. పాతాళ జలకు గడ్డపార తగిలితే నీరుబికినట్లు దుఃఖం ఉబికి వచ్చింది. కన్నీరు ధారగట్టింది. రామన్న తల వంచినాడు. గద్గద స్వరంతో "ప్రభూ! ఈ దీనుడింత గౌరవానికి, ఇంతటి ఆలనకు అర్హుడు కాడు".

"రామన్నా! ఆ ప్రసక్తి వదిలెయ్యి. నీ గాథ ఉన్నదున్నట్టు చెప్పు. నన్ను న్యాయపంథాలోకి పోనీయకు. ఆ పాపం నాకొడిగొట్టకు. ఆ మాటలు రామన్న హృదయానికి తగిలాయి. ఏనాటి క్రిందనో వదిలిపెట్టిన ఆప్తమిత్రుడు తిరిగి వచ్చిన తృప్తి తోచింది. ఇక తన గుట్టు దాచలేక పోయినాడు.

"ప్రభూ! ఈ నిర్భాగ్యుని కథ నిశ్శేషంగా వినండి. ఇంతటి ఆప్యాయతతోను, ధర్మ చింతతోనూ తామడిగినప్పుడు చెప్పకపోతే ధర్మం నన్ను హర్షించదు. ఇది వరకు చేసిన నేరం కంటే ఎక్కువవుతుంది."

జడ్జీ మాటాడకుండా వింటున్నాడు....

"తమరు చిత్తగిస్తే మా పరగణాలో నేను పెద్ద సంసారుల్లో లెక్కండి. మీ దయ వల్ల పెద్దలిచ్చినదే నూరెకరాలు కొండ్రా, దానితో బాటూ తోటా దొడ్డీ సమస్తం లోటు లేకుండా ఉన్నాయి. కుటుంబం చాలా సాంప్రదాయమైన కుటుంబమండీ? నేను పెద్దలప్పుజెప్పిన వసతిని వృద్ధి చేస్తూ కుటుంబ సాంప్రదాయాన్ని కాపాడుతూ వచ్చానండీ! నిజానికి ఆ ప్రాంతంలో మంచొచ్చినా చెడ్డొచ్చినా నా చేతిమీదుగా నడుస్తోందండి".

"అవునవును, విన్నా అదంతా, అందుకే నాకు మరీ చిక్కు వచ్చింది."

"చిత్తం. వాస్తవానికి నాకు నా స్వంత వ్యవహారాలు దిద్దుకొనేందుకు తీరుబడుండేది కాదండి. పబ్లికు వ్యవహారాలతోటే రోజంతా సరిపోయేది. ఇంతెందుకు స్వామీ? నా మాటే మాటగా చెల్లిపోయింది ఇన్ని నాళ్ళున్నూ. కానీ ఇంట్లో మాత్రం ఒక్క లోటుండేదండి. చాలా కాలం వరకు సంతానం కలుగలేదండి. భార్య కాపురానికొచ్చిన రెండు మూడు సంవత్సరాల నుంచీ ఆ లోటు కనిపించడం ప్రారంభమైంది. ఈ లోపాన్ని గురించిన బాధ మొట్టమొదట మా ముసలమ్మతో ప్రారంభమై క్రమంగా నా భార్యకు పాకింది. లోక వ్యవహారాల్లో నిమగ్నుడైన నేను కొంత మొండికెత్తినా అప్రయత్నంగా నాకు ఇదొక లోపంగానే కనుపడి మనస్సుకు బాధ కలిగిస్తూ ఉండేది. సహజంగా ఇంటి వ్యవహారాల్లో ముక్తసరిగా ఉండే అలవాటు వల్ల ఈ బాధను మ్రింగేసే వాడిని. మా ముసలమ్మ మాట అలా ఉండగా ఈ వాంఛ నాకూ నా భార్యకూ కూడా ఆవేదనగా పరిణమించింది. కాని ఆ విషయమైన ప్రస్తావన చేయడానికి గాని, ఒకరి బాధ ఒకరితో చెప్పుకోవడానికి గాని మేము సాహసించ లేదు. క్రమంగా మా జీవితంలో మాంద్యం ఏర్పడింది గాని జీవితం మాత్రం యంత్రవతుగా నడిచి పోయింది. నా భార్య అనేక నోములు నోచింది. మందులూ మాకులూ సేవించింది. నేను ఆ ఆవేదన మనుస్సును బాధించకుండా ఉండాలని లోక వ్యవహారాల్లోనూ, ఏదో ధర్మకార్యాల్లోనూ నిమగ్నుడనయ్యే వాడిని. ఇలాంటి స్థితిలో నాకు నలభై సంవత్సరాలు వయస్సు వచ్చేటప్పటికి మా అదృష్టం పండిందనుకున్న రోజులు వచ్చాయి. నా భార్య గర్భిణి అవడం నాకు భార్య యెడల కొత్త మమకారం కలగడం తటస్థించింది.

ఈశ్వరుని కృప వల్ల నాకు కుమారుడు పుట్టేడు. బ్రహ్మాండమైన సంతోషంతో ఉత్సవం చేసుకుని మా తండ్రి రామయ్య పేరు పెట్టుకుని జన్మసార్థకమైన దని సంతోషించాము. అతి అపరూపంగా పెంచాము.. కుర్రవానికి పది సంవత్సరాలొచ్చాయి. చదువు కప్పచెప్పేను. అందులో ఏమీ చురుకు కనపడలేదు. చదువుకేమీ, బుద్ధి ప్రధానం కదా, అది తిన్నగా ఉంటే అంతే చాలనుకుని సరిపెట్టుకున్నా, కాని రోజు రోజూకు అదీ అనుమానంలో పడింది. అసలే నాది ముక్తసరి స్వభావం. అందులోనూ లేకలేక కలిగిన ఆ నలుసును గట్టిగా మందలించ లేకపోయాను.

కుర్రవాడికి పద్దెనిమిదేళ్లు వచ్చాయి. చదువు అట్టే అబ్బలేదని లోపల నాకు బాధ ఉండేది. కాని ఎవరి కర్మ వాళ్ళది. చదువుకోవడానికి నేను అవకాశాలు ఇచ్చాను కదా. అంతకంటే నేనేం చెయ్యను అని సంతృప్తి పరుచుకునే వాడిని. మా నాయనెంత చదువు చదువుకున్నాడు? నేనెంత చదువుకున్నాను, కాని నా ఆశలన్నీ విఫలమైనాయి. నీతుంటే చాలనుకున్న ఆశ కూడా విఫలమైపోయింది. "రామన్నకు నిస్పృహతో కూడిన వెర్రి దుఃఖం పొంగి మాటాడలేక పోయాడు." కాస్సేపటికి సంబాళించుకున్నాడు.

"నా కొడుకు కొంచెం త్రాగుతున్నాడనీ, పోకిరీ స్నేహాలు పట్టి జూదం జులాయితనం లోకి దిగేడనీ కర్ణాకర్ణిగా వింటూ వచ్చాను. కాని ఎవ్వరూ నాతో మాత్రం చెప్పేవారు కారు. తల్లి ఒకటి రెండుసార్లు 'అబ్బాయి చెడ్డ స్నేహాలు చేస్తున్నాడట. మందలించమని' చెప్పుతూ వచ్చింది. 'మన బంగారం మంచిదైతే సరి' అని నీళ్ళు నమిలేశాను. అప్పుడప్పుడూ చూచాయిగా మందలించే వాడిని. కొన్నిసార్లు ప్రత్యక్షంగా కూడా చెప్పిచూచాను. అంతకంటె చొరవ చెయ్యడం నా స్వభావం కాదు. చెయ్యలేక పోయాను. అంతే. తుదకు వాడి దుర్మార్గం బహిరంగంగా చెప్పుకోవడం దాకా వచ్చింది. నా పరువుకు కూడా తాకిడి తగిలింది. లోక వ్యవహారాలు గురించి మాట్లాడుతూ కొందరు 'ఊరందరికీ పంచాంగాలు చెప్ప వచ్చు. తనదాకా వస్తే తెలుస్తుంది' అని వ్యంగ్యంగా దెబ్బలు కొట్టడం ప్రారంభించారు. మరికొందరు ప్రత్యక్షంగానే 'లోకానికంతా చెప్తావు నీతులు. నీ కొడుకుని సర్దుకోవేం?' అని చెప్పుతూ వచ్చారు. అలాంటి రోజున కొడుకు మీద చిరాకు పడడం తప్ప ఏమీ చెయ్యలేక పోయినాను. చేసే అదునుకూడా తప్పి పోయిందేమో. అప్పటికప్పుడే నా పరువు కొన్ని అంతరాలు పడిపోయింది. కొద్దిరోజుల క్రిందట కొందరు పెద్ద మనుష్యులు నా యింటికొచ్చి నేను నా పలుకుబడిని దుర్వినియోగం చేస్తున్నానని, కొడుకుని అచ్చోసి ఊరిమీదకు వదిలి పెట్టేననీ, వాడి ప్రవర్తనకి బాధ్యత నాదే అని ఘట్టిగా చెప్పేరు. అప్పటికప్పుడే వాని ఆకతాయితనం మితిమీరింది. నాకు శరీరం నీరైపోయింది. మాటాడలేక పోయాను. మౌనంతో నా అపరాధాన్ని అంగీకరించాను. నా ప్రారబ్ధాన్ని నిందించుకున్నాను. కొడుకు కోసం ఉబలాటపడినంత కాలంలో వెయ్యోవంతు కాలం పట్ట లేదు ద్వేషం కలగడానికి. కొడుకును గట్టిగా మందలించాను. కాని వ్యవహారం ముదిరిపోయింది. కట్టు తప్పింది. నన్నే ధిక్కరించాడు... ఇక నెందుకు? ఆఖరు రోజు కథ చెప్తాను. సాయంకాలం ఇంటికొచ్చేసరికి పడమటి వీధి పెద్దమనిషి అతి ఆవేశంతో వచ్చి నన్ను అనరాని మాట అన్నాడు. అనడానికి సబబుంది. పడడానికి నేను అన్నివిధాలా అర్హుడనైనాను. ఆయన ఆడుబిడ్డను నా నిర్భాగ్యుడు అగౌరవం చేశాడు. వాళ్ళు నలుగురూ మెత్తగా సున్నంలోకి ఎముక లేకుండా వాడిని తన్నేరు. అంతటితో ఆగక

## నిజమే

పాన్ అందుకుంటూ
"పాపా!... నీ అరచేతులు
తమలపాకులు"
గారవళ్ళతో కవిత్వమొలకబోశాడు....
కన్నుగీటుతూ...
నిజమే తమలపాకులే...
వాడి చెంపల మీద పండాయి!

-ఎస్. హనుమంతరావు

వాడి మీద కేసు బనాయించి నాతో చెప్పడానికొచ్చారు. మరునాడు పోలీసులు వాడిని అరెస్టు చేయడమే తరువాయి. నా యోగ్యత, నా కుటుంబ సాంప్రదాయం, ఆకాడికొచ్చాయి. వాళ్లు తీవ్రంగా నన్ను తిడుతుంటే సిగ్గుచేత నేను భరిస్తే అదిగూడ వాళ్ళు అపార్థమే చేసుకున్నారు. నా మెత్తదనమే ఊరి కుపద్రవమని ఎత్తి పొడిచారు. నా శరీరమంతా పోట్లు పొడిచి నట్లయింది. హృదయం కుమిలిపోయింది. వాళ్ళను సమాధానపరచి చావడిలో కుర్చీలో పడ్డాను. పొంగివస్తున్న దుఃఖాన్ని ఆవేశాన్ని ఆపుకున్నాను. నా భార్య భోజనానికి పిలవడానికొచ్చి నా వాలకం గ్రహించింది. జరుగనున్న సంగతి చెప్పేసరికి! అదునులో అదలించకపోతే ఏమవుతుంది. అనుభవించాలి' అంది. ఆమె కూడా ఆ బాధ్యత నా నెత్తినే వేసింది. ఆ రాత్రి నా కొడుకు ఇంటికొచ్చేదాక వాకిట్లోనే కనిపెట్టుకున్నాను. రాత్రి తొమ్మిది పదిగంటల మధ్య తూలుతూ వచ్చాడు. కళ్లు జ్యోతుల్లా ఉన్నాయి. నాకేసి చూడకుండానే గభాలున తన గదిలోకి ఒక్క చెంగున దాటేడు. ఒక్క క్షణం నిదానించి లోపలికెళ్ళేను.

"ఏమబ్బాయి! ఏం పనిది?" అన్నాను.

"ఏం"

"నీ కుటుంబ సాంప్రదాయమేమిటి? నీ అంతస్తేమిటి? నువ్వు చేస్తున్న పనేమిటి?"

"..................."

"కళ్లల్లా ఉన్నాయేం?"

"తాగుడు...."

# అడవి కన్య

సినిమాల ధర్మమా అని
అడవికన్య కూడా
బట్టలిప్పే నర్తిస్తోంది
వాతావరణ ప్రభావం
పత్రహరిత వస్త్రాల కొరత
హరించుకుపోయే మానవత!

–జి. విజయశ్రీ

ధోరణి ముదిరిపోయింది. ఇదివరకెన్నడూ ఇల్లాంటి బహిరంగధికార్కం లేదు. ఇక అలాంటి ప్రశ్నవేస్తే మాట దక్కేటట్లు లేదు.

"సాయంత్రమేదో అల్లరి జరిగిందటగా?"

"అవును మామూలు అల్లరే. కొత్తేమిటి?"

"నిన్ను అరెస్టుగూడా చేస్తారటగా?"

"నన్నెవ్వరూ అరెస్టు చేయలేరు?"

"ఏం?"

"ఎవరికీ అందనుగా! మానవ మాత్రుడి తరంగాదు"

"అబ్బాయి... ఏమిటి నీకీ కర్మం?"

"ఇప్పుడిక మాట్లాడకు... ఇప్పుడు చెప్పి లాభం లేదు. అసలు నువ్వే కారణం నా స్థితికి".

"నేనా! ఏం?"

"ముమ్మాటికీ నువ్వే. నువ్వే".

వాడి కంఠంలోంచి ఆ మాటలు పిడుగుల్లా పడ్డాయి.

"నేనేమి చేశాను? నీకేమి తక్కువైంది... ఇంతకూ నీ కర్మ ఇలా ఉంది...."

"నా కర్మా.... అవును. నీ కర్మ కూడా ఇల్లాగే ఉంది.... నాకేమీ లోటులేదు... నీ అలక్ష్యమే నన్నింత చేసింది"

నా హృదయం కలుక్కుమంది. అట్లే హృదయం చిక్కబట్టుకుని "నాయనా! నీ మంచితనానికీ నేనడ్డొచ్చానా?" అని అడిగేను.

"అడ్డుకూడా రావాలీ! నాకు తండ్రి సహాయం కావలసిన రోజుల్లో నీకు తీరిక లేదు. ఊరి వ్యవహారాలన్నీ చక్కదిద్ద గలిగేవుగాని నా బ్రతుకు దిద్దలేక పోయినావు. నా కర్మకు నన్ను ఇదివరకు వదిలిపెట్టనే వదిలి పెట్టేవు. ఇక ముందరా వదిలిపెట్టు" అని బావురుమని ఏడ్చి తల అటు త్రిప్పుకున్నాడు. ఆ స్థితిలో మాట్లాడి ప్రయోజనం లేదని నేను పొంగుతున్న దుఃఖాన్ని సంబాళించుకోలేక బయటి కొచ్చాను. 'నువ్వే బాధ్యుడవు. నా కర్మానికి నన్నొదిలిపెట్టు' అనే మాటలు నా చెవుల్లో గింగురు మంటున్నాయి. అప్పుడేకాదు ఇప్పటికీని. ఒక్క ఝామయినాక కొంచెం మూలుగు వినిపించింది. ఏమోనని లోపలికెళ్లి చూసేసరికి గుండె గుభేలుమంది.

కుర్రవాడు మరణావస్థలో ఉన్నాడు. మంచంమీద ఏదో సీసా వుంది. అరవబోతే నోరు రాలేదు. నోరు తడబడుతూ 'నాన్నా, నన్ను శాంతంగా చచ్చిపోనియ్యి. ఇదే నువ్వు చేసే ఉపకారం. నలుగురినీ పిలిచి నా బ్రతుకు అల్లరి చెయ్యకు. ఒక్క క్షణం... నా కర్మ. నీకర్మ.... కుటుంబాని కింక కళంకం లేదు' అంటూనే ఒక్క క్షణంలో నా చేతుల్లోనే ప్రాణం విడిచాడు. ఇక దాచటానికేముంది? గొల్లుమని తల్లిని పిలిచాను. ఆమె గొల్లుమని కూలింది కొడుకు మీద. తర్వాత ఏముంది? ఏడ్పులు, పెడబొబ్బలు. వాడి కోరిక ప్రకారం బ్రతుకల్లరి చేయకుండా నలుగురినీ పిలిచి ప్రొద్దున్నే ఈ చేత్తోటే దుమ్ము చేసొచ్చాను" అని బావురుమని ఏడ్చాడు. మాట తొణకలేదు

అప్రయత్నంగా జడ్జీగారి కంటి కొలకుల్లో నీటి బిందువులు క్రమంగా చేరుకుని చెక్కిళ్ల మీదికి ప్రవహించాయి. ఒక్క క్షణమాగి.

"రామన్నా! అయితే నువ్వెందుకిలా వచ్చావు? ఈ కేసేమిటి?"

"అయ్యా, చేయవలసిన తంతంతా జరిపించాక ఇల్లు వల్లకాడుగా కనుపించింది. అనుక్షణం 'నువ్వే బాధ్యుడవు! ఊరంతా చక్కపెట్టేవు. కొడుకు బ్రతుకు దిద్దుకోలేక పోయావు' అనే మాటలు హృదయానికి శూలాల్లా గ్రుచ్చుకొన్నాయి. అట్టే ఆలోచిస్తే అందులో సత్యమున్నట్టు తోచింది. చిన్నప్పుడు గారాబంచేత, మధ్యకాలంలో తీరిక లేక, కొంచెం ముదురుపట్టాక అహంకారంతో కూడిన ప్రతిష్ఠ చేత వాడి బ్రతుకును గురించి పుచ్చుకోవలసిన జాగ్రత్త వుచ్చుకోలేదు. చేతులారా కొడుకును చంపుకున్నాను. ప్రపంచం అంధకారమైంది. బ్రతుకు మీద సుతరాం ఇష్టం లేదు. నూతిలోనో గోతిలోనో పడి ప్రాణం పోగొట్టుకోవడానికి అహంకారం - ప్రతిష్ఠ అడ్డమొచ్చాయి. తరువాతి గాథ నే చెప్పనక్కరలేదు. నా బ్రతుకు ఒక్క క్షణం యుగంలా ఉంది. అపరాధిని... నన్ను వదలకండి... నా ఆవేదనను త్వరలో ముగించండి..." అని సాష్టాంగ నమస్కారం చేశాడు రామన్న జడ్జీగారికి.

❀❀❀❀

పదకొండు గంటలకు సమావేశం కావాలసిన కోర్టు నాలుగు గంటలకు వాయిదా వేయబడింది. ముద్దాయితో జడ్జి ప్రైవేటు రూములో మాట్లాడే అపూర్వ విషయాన్ని గురించి కోర్టు ఆవరణలో కొంత లావాదేవీలు జరిగాయి. నాలుగు గంటలకు జడ్జీ ముద్దాయిని నిర్దోషిగా నిర్ణయిస్తూ తీర్పు చెప్పేడు. జడ్జిమెంటులో రామన్న గాథ యావత్తూ ఉదహరించి తన అపూర్వా చర్యను సమర్థించుకున్నాడు. మామూలుగా విడుదలైన కూనీ కేసు ముద్దాయిల్లాగ రామన్న ఎగిరి గంతెయ్యలేదు. నిస్పృహ, ఆశాభంగం అతని ముఖం మీద తాండవించినాయి. గ్రుడ్డివాడు తడుముకుంటూ నడిచినట్లు డాకులో నుంచి బయటికొచ్చాడు. ఇల్లు, వాకిలి లేనివాడులాగ శూన్యం ప్రపంచంలో పడ్డాడు. కోర్టులో రకరకాల సంచలనం కలిగింది. గజపతిరావు నాయుడు మాత్రం బ్రతుకు జీవుడా అని తల తడుముకున్నాడు.

❀❀❀❀

రామన్న ఎక్కడెక్కడ తిరిగి స్వగ్రామం ఎప్పుడెళ్ళేడో ఎవరికీ తెలియదు. ఒక రోజు తెల్లారేసరికి ఇల్లు తాళం వేసి ఉంది. లచ్చుమ్మ కూడా అంతర్ధానమై పోయింది. తన యావదాస్తికి ట్రస్టు ఏర్పాటు చేసి, దానికి సర్వాధికారాలతో రిటైరు కానున్న జడ్జి గిరిరావు పంతులును యజమానిగా చేసి, కొడుకు పేరిట 'శ్రీరామ శరణాలయం' అనే పేరుతో అనాథ బాలబాలికలకు శరణాలయాన్ని స్థాపించవలసినదిగా నిశ్చయించి , అందుకు తగిన కాగితాలను సక్రమంగా సృష్టించి వాటిని గిరిరావు పంతులుకు అందచేశాడు. అందులో వుత్తరోత్తరాకూడా తన పేరు ఎక్కడా రాకుండా నిషేధించుకున్నాడు.

❀❀❀❀

రామన్న దంపతుల జాడ ఎవరికీ తెలియలేదు. కాని అతనేర్పాటు చేసిన శరణాలయం విశేషమైన ఆడంబరం లేకుండా ఆ ఊళ్లోనే అవిచ్ఛిన్నంగా సాగుతోంది. ■